క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట నరసింహ

పుట్లూరు: బయన్నస్వామి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ వెంకట నరసింహ సూచించారు. శుక్రవారం ఆయన మడుగుపల్లి గ్రామానికి చెందిన ప్రజలతో మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఉంటూ ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. దాదాపు 8 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలకు అనుమతి లేదని, ఈ సంవత్సరం అందరూ కలిసికట్టుగా వేడుకలు నిర్వహించుకుంటామని గ్రామస్తులు ఎస్‌ఐకి తెలిపారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన 30 మందిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు.

పండుగ రోజుల్లో కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు

తాడిపత్రి రూరల్: ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్ పండుగ రోజుల్లో కూడా ఆయా కేంద్రాల వద్ద విద్యుత్ బిల్లుల చెల్లింపులు జరుగుతాయని ఈఆర్‌ఓ నరసప్ప శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం, వడ్లపాలెంలోని ఫీజ్ కాల్ ఆఫీసు, యాడికి మండల కేంద్రం, రాయలచెరువుల్లోని కేంద్రాల్లో వినియోగదారులు కరెంట్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

జుమ్మతుల్ విదా నమాజులు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గుత్తి రూరల్: ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం(జుమ్మతుల్‌విదా)ను ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. గుత్తి, గుత్తి ఆర్‌ఎస్, మండలంలోని బసినేపల్లి, కొత్తపేట, మాముడూరు, అబ్బేదొడ్డి, ఊటకల్లు, రజా పురం గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక నమాజు చేశారు. ఈ సందర్భంగా మసీదుల్లో మహమ్మద్ ప్రవక్త (సల్లల్ల హు అసల్లం)జీవిత విశేషాలను గురించి మత గురువులు వివరించారు.

పశుగ్రాసానికి నిప్పు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం పశుగ్రాసానికి నిప్పు పెట్టారని బాధిత రైతు వెంకటేశ్వర్లు వాపోయాడు. పశువుల కోసం వరి గడ్డి, వేరుశనగ గ్రాసం కలిపి గడ్డి వాము వేసుకున్నామన్నాడు. నిప్పు పెట్టడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

మూడు బ్రాంచ్‌ల మంజూరు



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు ప్రెసిడెంట్ అబ్దుల్ జిలాన్

గుత్తి: గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు కింద మరో మూడు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడానికి ఆర్‌బీఐ నుంచి అనుమతులు వచ్చినట్లు టౌన్ బ్యాంకు ప్రెసిడెంట్ అబ్దుల్ జిలాన్ తెలిపారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని టౌన్ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్, బ్యాంకు డైరెక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం గుత్తి టౌన్ బ్యాంకు కింద గుత్తి ఆర్‌ఎస్, పామిడి, అనంతపురంలో బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. గుంతకల్లు, డోన్, కదిరిలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు వచ్చాయన్నారు. అలాగే రాయదుర్గంలో కూడా బ్రాంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం టౌన్ బ్యాంక్ రూ.200 కోట్ల టర్నోవర్ కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

గుత్తి రూరల్: మండలంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఊబిచెర్ల గ్రామంలో తాగునీటి లభ్యత అధికంగా ఉందని ఎస్సీ కాలనీకి పైపు లైన్ ఏర్పాటు చేయాలన్నారు. రూ.2లక్షల వరకూ మండల పరిషత్ నిధులు కేటాయిస్తామన్నారు. బాచుపల్లి జంగాల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఊటకల్లులో పంచాయతీ బోరు ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేయడంతో, అక్కడ సమస్య ఏర్పడిందన్నారు. ఊటకల్లులో బోరు సమస్యపై ప్రభుత్వ న్యాయవాదితో సంప్రదించి కోర్టుకు వెళ్తామన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ మల్లేష్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశ్విని, కార్యాలయ సిబ్బంది అబ్దుల్, రాజేష్, వాసు పాల్గొన్నారు.

ఉపాధికి లేదు హామీ



- పని ప్రదేశంలో సౌకర్యాలు శూన్యం
- వేసవి అలవెన్స్‌లకు మంగళం
- పెండింగ్‌లో కూలీల వేతనాలు
- నిర్లక్ష్యపు నీడలో ఉపాధి పనులు



కోటంకలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గార్లదిన్నె: ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారిపోతుంది. పనులు లేక ఉపాధి కోసం ఎదురు చూస్తున్న కూలీలకు ఏడాదిలో కనీసం 100 రోజులు పని కల్పించాలని అప్పటి యుపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి అరకొరగా నిధులు కేటాయిస్తుండడంతో ఆ పథకం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆచరణలో ఆ స్థాయిలో పనులు జరగలేదనే విమర్శలు వస్తున్నాయి. జాబ్ కార్డు ఉన్న వారందరికి పనులు కల్పించడంతో అధికారులు పూర్తి విఫలమవుతున్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు శూన్యం

వేసవి కాలం కావడంతో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు నీడ కోసం టెంటు వేయాలి. అలాగే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు, వంటివి పనుల ప్రదేశంలో కూలీలకు అందుబాటులో ఉంచాలి. కానీ కూటమి ప్రభుత్వం అలాంటి ఏమి పనులు వద్ద ఏర్పాటు చేయలేదు. దీంతో చాలా మంది కూలీలు ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. అదేవిధంగా పనులకు వెళ్లడానికి కూలీలకు రవాణా చార్జీలు ఇవ్వడం లేదు.మస్టర్ వేయడానికి నియమించిన మేట్లకు గత ప్రభుత్వంలో ఇస్తున్న రూ.5వేలు పారితోషకంను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది.

పెండింగ్‌లో ఉపాధి బిల్లులు

పనులు చేసిన ఉపాధి కూలీలకు గత నాలుగు వారాల నుంచి బిల్లులు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఉపాధి కూలీలు ఎంత పని చేశారు? ఎంత కూలీ పడిందని తెలుసుకోవడానికి 10 రోజులకు ఒక సారి కొలతలు తెలుపుతూ ప్రతి కూలీకి ప్లే స్లిప్పులు ఇవ్వాల్సి ఉండగా ఆ ఊసేలేదు. దీంతో క్షేత్ర స్థాయిలో కూలీల శ్రమ దోపిడి గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి, చేసిన పనికి ఫలితం దక్కడం లేదని కూలీలు వాపోతున్నారు.

వేసవి అలవెన్స్‌లకు మంగళం...

ఉపాధి కూలీలకు ప్రతి ఏటా వేసవిలో ఉపాధి కూలీలకు అలవెన్స్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇచ్చే వేతనంలో జనవరి, ఫిబ్రవరిలో 10 శాతం, మార్చిలో 20 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం అలవెన్స్ ఇవ్వాల్సి ఉంది. కానీ అలవెన్స్‌లకు కూడా మంగళం పాడారని కూలీలు ఆరోపిస్తున్నారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి



వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న కూలీలకు అదనంగా 200 పని దినాలు కల్పించి వలసలు నివారించాలి. అలాగే పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించి, వేసవి అలవెన్స్, పే స్లిప్‌లు అందజేయాలి. దూర ప్రాంతంలో పనులకు వెళ్లే కూలీలకు రవాణా చార్జీలు అందించాలి. ఉగాదిలోపు పెండింగ్ బిల్లులు వెంటనే అందించాలి.

– చెన్నారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం ఎండలు పెరిగిపోతున్నాయి. పని ప్రాంతాల్లో పనులు చేసే కూలీలకు సౌకర్యాలు కల్పించాలి. కనీసం పని ప్రదేశంలో తాగు నీరు సౌకర్యం, మజ్జిగ ఇవ్వడం లేదు. పనులు చేసే సమయంలో చిన్న చిన్న గాయాలు అయితే ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేవు.

– అక్బర్,రాయల సీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి



గుంతకల్లులో ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



శింగనమలలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్/శింగనమల/పామిడి : కూటమి ప్రభుత్వం విధించిన ఇంధన సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. ప్రజలపై భారాన్ని మోపుతూ పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుంతకల్లులోని విద్యుత్ నిలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే రెండుసార్లు విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని వారు విమర్శించారు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగరాజు, సురేంద్ర, రామునాయక్, అబ్దుల్లా, ఓబులేసు, సూరి తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరులతో ప్రజలపై భారం మోపుతున్నారని, వెంటనే ఉప సంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అలాగే పామిడిలో సీపీఎం నాయకులు స్మార్టు మీటర్లు ఉపసంహకరించాలి, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు పరచాన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్ శ్రీధరమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు పీ అనిమిరెడ్డి, మల్లేసు, ఈశ్వరయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జోన్‌లోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను యథావిధిగా సికింద్రాబాద్ జోన్‌లోనే కొనసాగించాలని గుంతకల్లు రైల్వే జోన్ సాధన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గుంతకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత కరువు ప్రాంతమైన రాయలసీమలో విస్తరించి ఉన్న గుంతకల్లు డివిజన్ రైల్వేజోన్‌గా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి దోహదపడేదన్నారు. అయితే విశాఖ రైల్వేజోన్‌గా ఏర్పాటు చేయడంతో రాయలసీమ అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం కర్నూలు వచ్చిన హైకోర్టు న్యాయ కార్యాలయాలను తరలించి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ జోన్ గుంతకల్లు రైల్వే ఉద్యోగులకు, ప్రజలకు అనుకూలంగా ఉండదన్నారు. ఎందుకంటే దాదాపు 750 కి.మీ.కు పైగా దూరం ఉండటంతోపాటు కార్యాలయ పనులపై వెళ్లాలంటే కనీసం మూడు రోజులు సమయం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు కాశీరావు, గురుశంకర్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, వేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

31 మందిపై కేసు నమోదు

గుత్తి: మద్యం సిండికేట్ లావాదేవీల విషయంలో ఈ నెల 26న కోనా వర్గానికి, టీడీపీ శ్రేణులకు మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం టీడీపీ నాయకుడు సూర్య ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వర్లు మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డితో పాటు మరో 31 మందిపై కేసు నమోదు చేశారు. తనను, తన అనుచరులను కోనాతో పాటు మరో 31 మంది దౌర్జన్యం చేశారని, బెదిరించారని సూర్యప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కోనా తో పాటు మరో 31 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా దౌర్జన్యానికి పాల్పడి, బెదిరించి, ఇంటిపై దాడి చేసిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని కోనా, ఆయన వర్గీయులు వాపోయారు.

పోలీసుల పెట్రోలింగ్

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు, కోటంకలో శుక్రవారం రాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ ఈ నెల 26న ఉరవకొండ మండలం అమిద్యాల, వజ్రకరూర్‌లోని పెట్రోల్ బంకుల్లో సిబ్బందిని కొట్టి నగదు దొంగలించుకెళ్లారన్నారు. ఈ క్రమంలో ముందు జాగ్రత్తగా గార్లదిన్నె నుంచి గుంతకల్లు వరకూ ఉన్న పెట్రోల్ బంకుల వద్ద రాత్రి సమయంలో స్పెషల్ పార్టీ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలు జరుగకుండా పెట్రోల్ బంకు యాజమానులను అప్రమత్తం చేస్తారన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈఓ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో భక్తుల కానుకల రూపంలో రూ.82,079, నగదు రూ. 8,466ను సమర్పించినట్లు అధికారులు తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కె.రాణి పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి ఆలయంలో..

పామిడి: పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కింపు చేపట్టారు. ఉరవకొండ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కే రాణి ఆధ్వర్యంలో ఈఓ ఏ క్రిష్ణయ్య సమక్షంలో కమిటీ సభ్యులు, భక్తులు అర్చకులు కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా రూ.1,62,479 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మురళీధర్‌గుప్తా, పీ సురేష్‌కుమార్, కే నారాయణమూర్తి, వడ్డే వెంకట్రాముడు, యంగమ్మ, గణేష్, మల్లికార్జున, పవన్‌కుమార్, పార్వతమ్మ, హరి. ఆలయ అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో శుక్రవారం ఓ వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల వివరాల మేరకు..భాస్కర్ అనే వ్యక్తి ఇంటి వద్ద శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే మంటలు ఆర్పి 108లో క్షతగాత్రున్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంటల్లో భాస్కర్ శరీరం 40 శాతం కాలిపోయి విషమంగా ఉంది. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్



భోజనం వడ్డిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, నదీమ్ అహమ్మద్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శింగనమల: ముస్లింలకు ఎంతో పవిత్రమైన పండుగ రంజాన్ మాసమని వైఎస్సార్‌సీపీ ఎస్‌ఆర్‌ఐ విభాగ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఎస్‌ఆర్‌ఐటీలో మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, పార్టీ ఎస్‌ఆర్‌ఐ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన ముస్లింలతో పాటు నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహమ్మద్, శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, నియోజకవర్గంలోని ముస్లింలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం చెల్లించాల్సిందే



రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నిర్వాసితులు

అనంతపురం అర్బన్: జాతీయ రహదారి 544డీ నిర్మాణ క్రమంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుత ధరల ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వాసితులతో కలసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రైతులు, కూలీలు ఇళ్లను కోల్పోతున్నారన్నారు. 2018లో అధికారులు సర్వే చేసి రోడ్డు విస్తరణలో ఇళ్లు పోతాయని చెప్పారన్నారు. ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తామని.. ధర మీద రెట్టింపు పరిహారం ఇస్తామని గ్రామసభలో రెవెన్యూ అధికారులు చెప్పినట్లు గుర్తు చేశారు. ఇక పట్టా భూమికి, అసైన్డ్ భూమికీ ఒకే పరిహారం ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. 2018 ధరలకు అనుగుణంగా ధర నిర్ణయించి రెండు రెట్లు అధికంగా ఇస్తామని చెప్పి ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈనెల 27న కొందరికి 2018లోని మార్కెట్ విలువ అంచనా ప్రకారం చెల్లించారన్నారు. పరిహారానికి సంబంధించిన జాబితా ఎవరికీ తెలియకుండా చేసి బాధితులకు అన్యాయం చేశారని తెలిపారు. పరిహారం విషయంలో నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి, బీహెచ్‌రాయుడు, నిర్వాసితులు రంగారావు, శివశంకర్, శ్రీనాథ్, జయమ్మ, పుష్పావతి, అంజనమ్మ, నారాయణ స్వామి, కాసీం పీరా, నవీన్, బ్రహ్మయ్య, సురేంద్ర, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుకాణాల నిర్వహణకు వేలం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలోని దుకాణాల నిర్వహణకు అధికారులు వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి ఎనిమిది మంది పాటదారులు పాల్గొన్నారు. మూడేళ్ల పాటు దుకాణాల నిర్వహణకు యజమానులు 14 గదులకు ప్రతి నెలా రూ.1.15 లక్షలు అద్దె చెల్లించేలా వేలంలో దక్కించుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, రంగస్వామి, వెంకట్రాముడు, నరశింహులు, వెంకటనాయుడు, గుర్రప్ప, చిన్నరంగస్వామి, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 15లోపు దరఖాస్తులు సమర్పించాలి

గుంతకల్లు రూరల్: ఏప్రిల్ 30న నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తమ అప్లికేషన్స్‌ను ఏప్రిల్ 15లోపు సమర్పించాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌వీ రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రిజిస్ట్రేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.100, ఓసీ, బీసీలకు రూ.400 చెల్లించాన్నారు.

హింగులాజ్ మాత ఆవిర్భావ దినోత్సవం

పామిడి: పట్టణంలోనిల చిన్న విఠోబ దేవాలయంలో శుక్రవారం రాత్రి రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో హింగులాజ్ మాత ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక అభిషేకార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ క్రిష్ణయ్య, ఫిర్కా సభ్యులు నాగభూషణం, మంజునాథ్‌రావు, లింగాధర్, వెంకటేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆత్మహత్యలను ఆపాలి'

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికమవుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను ఆపాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ,ఎస్టీ, బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చోటుచేసుకున్నా నలుగురు విద్యార్థుల ఆత్మహత్యలపై సీబీఐ చే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులను సంఘటిత పరచి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం విద్యార్థులు మణికంఠ, గోపినాథ్, భాస్కర్, రాము, రమేష్‌రెడ్డి, అశోక్‌బాబు, సాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామం వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెప్మా సీఎంఎం ఉద్యోగ విరమణ

గుత్తి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగంలో సీఎంఎం(సిటీ మిషన్ మేనేజర్)గా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మెప్మా సీఓలు చంద్రశేఖర్, సురేఖ, ఆర్పీలు అతడిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.

జూదరుల అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ దాడులు నిర్వహించి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్ జగన్‌తో వైవీఆర్ భేటీ



వైఎస్.జగన్, భారతిరెడ్డి దంపతులను కలిసిన మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం బెంగళూరులోని జగన్ నివాసంలో అధినేతను కలసిన వైవీఆర్ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సర్వైకల్ సర్జరీ చేయించుకున్న అనంతరం మొదటిసారి అధినేతను కలసిన వైవీఆర్ ఆరోగ్యం గురించి వైఎస్.జగన్, భారతిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లాతో పాటు గుంతకల్లు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై జగన్ ఆరాతీశారు. వైవీఆర్‌తో పాటు ఆయన కుమార్తె, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ నాయకుడు జానకిరామిరెడ్డి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దపప్పూరు: ఎంపీపీ–2గా పసలూరు ఎంపీటీసీ నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తిమ్మంపల్లిలోని ఆయన నివాసంలో కలసి మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, పంచాయతీ వింగ్ అధ్యక్షుడు యోగీశ్వర్ రెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు నాగలింగేశ్వర్‌రెడ్డి, కొట్టాలపల్లి రాంబాబు, చీమలవాగుపల్లి రంగేశ్వర్ రెడ్డి, కొట్టాలపల్లి అశోక్ తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ అభివృద్ధి కోసం అందరూ పాటుపడాలని, ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అండదండలు ఉంటాయని కేతిరెడ్డి పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు.

'ఆలూరు'కు సత్కారం

శింగనమల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఎస్‌ఆర్‌ఐ కో–ఆర్డినేటర్‌గా ఆలూరు సాంబశివారెడ్డిని ,నియమించడంతో శుక్రవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలమాలలతో సన్మానించారు. ఎస్‌ఆర్‌ఐటీలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు.

'ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వొద్దు'

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఇసుక రీచ్‌కు అనుమతి ఇస్తే ప్రభుత్వ కారాలయాల ఎదుట ధర్నా చేపడతామని ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ గనులశాఖ అధికారులకు వివరించారు. శుక్రవారం ఇసుక రీచ్ ఏర్పాటు పరిశీలన కోసం వచ్చిన జిల్లా గనులశాఖ అధికారి వరప్రసాద్‌రెడ్డిని ఎమ్మార్పీస్, సీపీఐ నాయకులు కలిసి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో రీచ్ ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శైలజానాథ్ జన్మదినం

పుట్లూరు/బుక్కరాయసముద్రం: పుట్లూరు మండలకేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి శైలజానాథ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు విష్ణునారాయణ, నారాయణస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రంలో నిర్వహించిన శైలజానాథ్ జన్మదిన వేడుకల్లో జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, వెంకటరెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, అన్నేరి ఆది నారాయణ, నందినేని మల్లికార్జున, కొండన్న, ముత్యాలశీన, శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, ఈశ్వరయ్య, సత్య నారాయణ, రంగా, ప్రసాద్, రాజా, కాటమయ్య, రవి, శేషానందరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు రేషన్ కిట్ల పంపిణీ

గుంతకల్లుటౌన్: ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని టీపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 125 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను ట్రస్ట్ చైర్మన్ పరుశురాముడు, శకుంతలమ్మ దంపతులు అందజేశారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ట్రస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తలారి రాజశేఖర్, చెన్నకేశవస్వామి, కౌన్సిలర్ మెహరున్నీసా, లాయర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి రోడ్డు ఆక్రమణ



రోడ్డు ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్డు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో టీడీపీ నాయకుడు రోడ్డును ఆక్రమించి షెడ్డు వేశాడు. వివరాలు.. చెన్నంపల్లిలో బ్రహ్మంగారి గుడికి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డును అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి అండతో అదే పార్టీకి చెందిన మహేశ్వరరెడ్డి రోడ్డును ఆక్రమించుకున్నాడు. అక్కడ షెడ్డు నిర్మాణం చేపడుతుండడంతో కాలనీకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఆక్రమణ దారునిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.